దసరా-సరదా

"శార్వాణి"

"నాన్నా! రేపు పండగటగా!" బయటనుంచి వచ్చి, కమీజు విప్పుతున్న వెంకటేశ్వర్రావు నడిగాడు మధు.

"ఎవరు చెప్పార్రా?" కమీజు కొక్కానికి తగిలించి, ఒక చేయిలేని కుర్చీమీద తాపీగా కూర్చున్నాడు.

"రేపు దసరా పండగని మా మాస్టరు చెప్పారు. కొత్తబట్టలు వేసుకొని గిలకలు పుచ్చుకొని బడికి రమ్మన్నారు."

మధు తండ్రికి దగ్గరగావచ్చి నించున్నాడు.

"రేపురా మాపురా మళ్లీ రమ్మనక!
పావలా అయితే గిట్టేది లేదు
అర్ధ రూపాయి అయితే ముట్టేది లేదు
రూపాయి అయితే పుచ్చుకుంటాము"

ప్రక్క యింట్లోంచి బడి పిల్లలు పాటలు పాడుతున్నారు.

"విన్నావా నాన్నా! అట్లాగే రేపు మేము గిలకలు తీసుకొని బయలుదేరుతాము. మరి కొత్తబట్టలు ఎప్పుడు కొంటావ్!"

కొత్తబట్టలు మాట వినేసరికి, వెంకటేశ్వర్రావు త్రుళ్లిపడ్డాడు. అంతర్యంలో ఏదో చేయలేనితనం బాధగా బరువుగా మూల్గింది.

"నాన్నా! నాకో కొత్త బట్టలు" బడి నుంచి వచ్చిన పాప నవ్వుతూ తండ్రి దగ్గరకువచ్చి మారాం చేయడం మొదలు పెట్టింది.

వంటింట్లోంచి వచ్చిన కుసుమ వాళ్ళకు కన్పించకుండా, కిటికీ నానుకొని నిలబడింది.

"నాన్నా! మాట్లాడవేం!" మధు భుజం పట్టుకొని వూపుతున్నాడు.

"ముందు నాకు కుట్టించిన తర్వాత అన్నయ్యకు." పాప చిరు కోపంగా మధు వంక చూస్తోంది.

"ముందు నాకే కుట్టించాలి!"

"ఊహుఁ! ముందు నాకె!"

అన్నా చెల్లెళ్లు పోట్లాడుకోవడం ప్రారంభించారు. వెంకటేశ్వర్రావు యిద్దర్నీ చేతులతో దగ్గరగా లాక్కొని, తల నిమురుతూ వారించాడు.

"పెద్దవాడివి. నీవు దెబ్బలాడకూడదు బాబు!" మధు వైపు ముద్దుగా చూశాడు.

"మరి చెల్లాయి చూడు." బుంగ మొహం పెట్టాడు మధు.

"అది చిన్నపిల్ల. దానితో నీవుకూడా సమానంగా పోట్లాడితే అంతా నవ్వుతారు. శాంతంగా వుండాలి.

ఎదురుగుండా వచ్చి నిలబడిన భార్యను చూచి,

"చూశావా నీ పిల్లలు! ఎంత హడావుడి చేస్తున్నారో?" అన్నాడు.

"మీరంతా మాటలు సందడిలో భోజనం సంగతి మరచి పోయారా!" భర్త కళ్ళలోనికి చిలిపిగా చూస్తూ అంది కుసుమ.

"వీళ్ళకు బట్టలు కుట్టించే అంతవరకు నన్ను కదలనిచ్చేటట్లు లేరు."

"మీ నాన్న బట్టలు కొంటారు. భోజనానికి రండి." పాపను వంటింట్లోనికి తీసుకొని వెళ్తూ, వెనక్కి

తిరిగి చూచింది. వెంకటేశ్వర్రావు యింకా లేవలేదు. కూర్చునే వున్నాడు.

"కూరలు చల్లారి పోతాయి. అందులో మీ కిష్టమైన కూర గుత్తి వంకాయి... లేవండి." అని కుసుమ వెళ్ళిపోయింది. మధు తల్లివెంట నడిచాడు. వాళ్లు కనిపించే వరకు చూచి, వెంకటేశ్వర్రావు ఆలోచనలో పడ్డాడు.

పిల్లలకు బట్టలు కుట్టించక పోతే బ్రతక నివ్వరు. మొన్న వెళ్ళిపోయిన వినాయక చవితికి కుట్టించలేదని పెద్ద గొడవ చేశారు. ఆ రోజు పూజ చేయనని బిగుసు కూర్చున్నారు. వాళ్ళను సముదాయించేసరికి ఆరోజు అతని తలప్రాణాలు తోకకు వచ్చాయి. రేపు బడిలో విద్యార్థులంతా కొత్త బట్టలు వేసుకొని వస్తారు. శ్రీమంతుల బిడ్డలు విలువైన గుడ్డలు ధరించి వస్తారు. మధ్య కుటుంబీకులు సాధారణమైన దుస్తులు తొడుక్కుంటారు. మరీ పేదవారు చినిగిపోయిన కమీజులకు సంస్కారంచేసి, నాగరికతకోసం బలవంతంగా నవ్వును తెచ్చుకుంటూ బయలుదేరతారు.

"మా నాన్న ఎంత మంచి బట్టలు కుట్టించాడో చూశావా?" ఖరీదైన దుస్తులు ధరించిన విద్యార్థి, ఇస్త్రీ బట్టలు వేసుకున్న పేదవిద్యార్థిని అడుగుతాడు. మొదటి విద్యార్థి రెండవవాడు బాధ పడతాడని గ్రహించడు. తన గొప్పను ప్రకటించుకుంటాడు. తనలోతాను మురిసిపోతుంటాడు. రెండవవాడికి బాధ మిగులుతుంది. తన దారిద్ర్యంమీద అసహ్యించుకుంటాడు. అసూయ పడతాడు.

"మీరు గొప్పవాళ్ళు గనుక మంచి బట్టలు కడతారు. పేదవాళ్ళం మా కెట్లాగ వస్తాయి" అక్కసంతా వెళ్లగక్కుతాడు.

రేపు తన కొడుక్కి కూడా అటువంటి అనుభూతి సంభవిస్తుంది. వాడు బాధ పడుతాడు. ఇంటికివచ్చి వాళ్ళంతా ఆవిధంగా అన్నారని ఏడుస్తాడు. బడికి వెళ్ళనని పట్టుపట్టి కూర్చుంటాడు. అసలేవాడు రణపెంకి. వాడ్ని సముదాయించేసరికి బ్రహ్మ పెళ్ళవుతుంది.

వెంకటేశ్వర్రావుకేమి పాలుపోవడంలేదు. చేతిలో చిల్లి కానిలేదు. నెలలో సగం రోజులైనా పూర్తిగా నిండకముందే జీతం హారతి కర్పూరంలాగ హరించి పోయింది. మళ్ళా ఒకటవ తారీఖుకోసం వేళ్లను లెక్క పెట్టుకుంటూ కూర్చోవడం.

రెండవ తారీఖున అప్పులవాళ్లు వీధి గుమ్మంలో "క్యూ"లో నిలబడతారు.

ఇంటద్దెవాడు మొదట నిలబడతాడు. వాడి అద్దె తీర్చేసరికి, జీతంలో మూడవవంతు భాగం పోతుంది. అపరాలవాడు, పాలమ్మాయి, కట్టెలవాడు, కూరగాయలమ్మాయి, వీళ్ళందరికీ సమాధానం చెప్పేసరికి, చేతిలో ఒకటో అరో మిగులుతుంది. మళ్ళా రెండవ తారీఖు నుంచి కాతాలకు ప్రారంభోత్సవం జరుగుతోంది. ఆ ప్రారంభోత్సవానికి ఎవర్ని ఆహ్వానం చేసిన రారు. బట్టల కొట్టులో కాతాలేదు. వాళ్ళు ఇస్తే పెట్టేవాడే! అధిక జీతాలు తెచ్చుకున్నవాళ్ళకే అక్కడ కాతాలకు స్థానం దక్కేది.

తనో!

గుమాస్తా!!

జీవితానికి అడుగడుగునా ఋణపడే రాస్తా!!!

"ఏమండీ! ఇంకా ఆలోచిస్తూనే ఉన్నారా! వాళ్ళ బట్టలు మీ బుర్రంతా కరాబు చేస్తున్నట్లున్నాయి. తీరుబడిగా ఆలోచించుకుందురుగాని, ముందు భోజనానికి లేవండి!"

కుసుమ, అతని ఆలోచనల్ని చెల్లా చెదర చేసి, మధ్య నవ్వుతూ నిలబడింది.

కచేరీలో పీక వరకూ పని. రాత్రింబవళ్లు కష్టపడినా ప్రతిఫలం సంతోష రహితం. రెక్కలు విరిగేటట్లు కష్టపడినా, డొక్కలు సంపూర్ణంగా నిండవు. సంతృప్తిలేదు. సంతోషంలేదు. భర్త కష్టం గురించి భార్య అర్థంచేసుకోలేదు. బాధను బరువుగా మోదకు

వ్రేలాడేసుకొని, నిరాశను నెత్తిమీద మోస్తూ ఇంటికి వచ్చే భర్తను చూస్తుంది.

మిద్దెమీద వుంటున్నమ్మాయి కొనుక్కున నెక్లెసు లాంటిది, ఎదిరింటమ్మాయి వేసుకున్న జాకెట్టు లాంటిది ...ఇటువంటి లిస్టు ఒకటి తయారుచేసి, గుమ్మం ఎక్కడంతోనే భర్తకు నివేదించుకుంటుంది. భార్య నివేదనను భర్త నిర్వేదిస్తున్న సంగతి కాలం కనిపెడుతుంది. ఆఫీసులో అధికారికి నచ్చచెప్పలేక, జీవితం మీద సగం ఆశ వదులుకొని ఇంటికివస్తే, ఇల్లాలు మిగత సగం ప్రాణం తీస్తుంది.

ఆ మానవుడు బ్రతికేదేలా?

కాని కుసుమ అటువంటిదికాదు. భర్త కష్టాల్లో సరి సమానంగా భాగం పంచుకుంటుంది. గుట్టుగా సంసారాన్ని వున్న దాంట్లోనే పొదుపుగా వాడుకుంటూ, భర్తను సుఖ పెట్టడానికి తన సాయ శక్తులా ప్రయత్నం చేస్తుంది. ఎన్ని కష్టాలు కలిగినా, ఎన్ని విస్తారాలు నిలిచినా, తేలిగ్గా ఎదుర్కొంటుంది. బాధపడుతూ ఆఫీసునుంచి వస్తున్న భర్తను, చిరునవ్వుతో ఆహ్వానించి సంతోష పెట్టేది. వెంకటేశ్వర్రావుకి పునర్జన్మను ప్రసాదించింది కుసుమ. జీవితంమీద ఆశను చంపుకున్న అతనికి, మళ్లా బ్రతకాలనిపించింది.

“మీ ఆలోచనా మీరూనూ! లేవండి భోజనానికి” చేయి పట్టుకొని, వెంట పెట్టుకొని వెంకటేశ్వర్రావుని భోజనం దగ్గర కూర్చో పెట్టింది. మధు పాప భోజనాల దగ్గర అంతకముందే కూర్చుని తింటున్నారు. వాళ్లవంక చూడ్డానికి భయపడుతున్నాడు వెంటటేశ్వర్రావు. అతడు ఎదురుగుండా కన్పిస్తే, బట్టల విషయం జ్ఞాపకం చేయకుండా మానరు. తండ్రి దగ్గర డబ్బు లేదని, ఆర్తి, బాధ, దుఃఖమంటే తెలియని ఆ పసిపాపల కేమితెలుసు?

“మీ నాన్న ఏం చేస్తారు?” మధు స్నేహితుడు మధును ఒకసారి అడిగాడు.

“మా నాన్న ఆఫీసరు” గర్వంతో సమాధానం చెప్పినప్పుడు, వెంకటేశ్వర్రావు స్వయంగా విన్నాడు. తనలో తాను నవ్వుకున్నాడు. ప్రపంచం దృష్టిలో అతడు గొప్పవాడుకాక పోయిన, కొడుకు దృష్టిలో గొప్పవాడయినందుకు, అతను పట్టరాని ఆనందం అనుభవించాడు.

తను, గుమాస్తా అన్న సంగతి గుర్తువచ్చిన వెంటనే నిట్టూర్చాడు.

“నాన్నా! బట్టలు!” అన్నం కలుపుకుంటున్న తండ్రిని చూశాడు మధు.

“కొందాములే!” గబ గబా అన్నం కలిపి కాస్త ఎంగిలి పడిలేచి, బయటకు వెళ్ళి పోబోతున్న భర్తను చూచింది కుసుమ.

“తిరిగి అన్నం వేయించుకోకుండానే లేచారేం!” పక్క చేతికిచ్చి, తమల పాకుల యీనెలను తీస్తూ, సున్నం రాసి యివ్వబోయింది.

వెంకటేశ్వర్రావు పక్కను నములుతూ తమలపాకులను తీసుకోకుండా వెళ్ళిపోయాడు.

గతుకుల బాటమీద జీవిత గమనాన్ని వెనక్కి తిరిగి చూస్తున్న, అతనికి కన్పించేది రాళ్ళబాట... ముళ్ళతోట.

ముందుకు వడివడిగా నడుస్తున్నాడు. కష్టపడిన రోజులు, ఋణపడినట్లు చూస్తున్నాయి. కష్టానికి ప్రతిఫలాన్ని అందివ్వలేక పోయేమని విలపిస్తున్నాయి.

“బ్రతుకున్నాం! ఎలా?” వెంకటేశ్వర్రావు గుండెమీద కొశ్చన్ మార్కు.

సమాధానం కోసం నరనాడులు నోళ్ళను తెరచుకొని కూర్చున్నాయి.

“చావలేక బ్రతుకుతున్నాం!” పాడు పడిన రోడ్డుమీద ఎత్తు పల్లాలకు సరిచేస్తున్నాడు కష్ట జీవి.

“దేనికోసం!” ఎవర్నడగాలి?

“పొట్టకోసం!!” ఎవరు సమాధాన మిచ్చేది?

కండరాల్ని ఎముకల్ని పెంచుతున్నాడొకడు.

“దేనికోసం?” ఎవర్నడుగు తున్నాం?

"పొట్టలు కొట్టడానికి ?" సమాధానం వస్తుంటే వినిపిస్తుందా ?

కష్టం మొకరిది... సుఖం వేరొకరిది.
కన్నీరొకరిది... పన్నీరు వేరొకరిది.
"బాబుకి కమీజు కొనాలి."
"పాపకు పరికిణీ కుట్టించాలి."

ఆశలను విశాలంగా చేస్తున్న జీవితం, నిశలో నిరాశగా నించుంది.

"ఆశలను పెంచుకొని నెరవేరలేకపోతే బాధ పడే దానికంటే, ప్రతి విషయంతో నిరాశ పడటంలో సుఖం వుందిరా !" రాఘవరావు మాటలు వినిపిస్తున్నాయి.

కనీసపు అవసరాలు ఆశలా ? చావలేక బ్రతకడం కోసం కోరుకోవడం ఆశా ??

వెంకటేశ్వర్రావుకి రేపు జరగబోయే పండగ జ్ఞాపకానికి వచ్చింది.

జీవితంలో మళ్ళా బ్రతకమని, పునర్జన్మ ధరించమని ఆశ పెడుతోంది రేపు. నిన్న చనిపోయిన నేను రేపు బ్రతుకుతాను. రేపు బ్రతికి ఎల్లుండి కోసం బాధ పడను.

నిన్న కష్టం గురించి బాధ పడినా,
రేపు మంచి కోసం ఆశను పెంచుకొని,
ఎల్లుండి జీవితానికి గట్టి పునాదులు వేస్తాను.

మధు కొత్త కమీజు కొత్త పంట్లాము వేసుకొని, చిన్ని గిలకను పట్టుకొని, జయ జయధ్వనులు చేస్తూ బడికి వెళ్తాడు. పాప పువ్వుల వోణీ, సిల్కు చోళీ ధరించి. పాటలు పాడుకుంటూ బయలు దేరుతుంది.

ఎంత ఆనందం !
ఎంత అందం ! !

రోడ్డుమీద తీయ్యటి కలలు కంటున్న వెంకటేశ్వర్రావు స్నేహితుడు రామారావు ఇంటికి చేరుకున్నాడు. తలుపులు వేసేసివున్నాయి. గుమ్మం దగ్గరకు వచ్చి నిలబడ్డాడు.

"ఇవ్వాళ సినిమాకు వెళ్ళ వలసిందే ! మీరెన్నో సినిమాలు చూస్తారు. ఒక్క సినిమాకుకూడ తీసుకొని వెళ్ళడానికి అంత ఇదవుతారు దేనికి !"

రామారావు భార్య మాటలు స్పష్టంగా వినిపించాయి.

"అబ్బబ్బ ! డబ్బు లేదని మొత్తుకుంటే నా ప్రాణాలు కొరుక్కొని తింటావు దేనికి !" భార్యకు కనువిప్పు చేయడానికి నానా అవస్థలు పడుతున్నాడు స్వతంత్ర దేశంలోని భావి భారత పౌరుడు.

"అంతా వట్టిది ! నే నడిగే సరికి డబ్బుంచుకొని లేదనెందుకు బుకాయిస్తారు. మగవాళ్లను నమ్మకూడదు. అన్నీ అబద్ధాలే కదా !"

"అబ్బ ! ఉండవే ! ఎవరైనా వింటే నవ్వుతారు." బ్రతిమాలుకుంటున్నాడు బయటకు వచ్చినపుడు పెద్ద కబుర్లు చెప్పే జీవుడు.

"ఎవరూ వినకుండా వెళ్దాం ! పదండి !" మళ్ళా మొదలకు వచ్చింది.

"నా దగ్గర రాగి దమ్మిడీ లేదు. తర్వాత నీ ఇష్టం" చరమాంకం — ఆఖరి పుట తిప్పాడు.

"రేపు విజయదశమి రేపు వెళ్దాం ! మంచి రోజు కూడాను." సూర్యగ్రహణం పట్టు విడువలేదు.

"పండగ డబ్బున్నవాళ్ళకు... మనకు కాదు."

"అసలు మిమ్మల్ని అడగటమే బుద్ధి తక్కువ. అసలు మగవాళ్లను నమ్ముకొని ఏ ఆడది బాగుపడింది"

తర్వాత ఇద్దరి మధ్య మాటలు వినిపించలేదు. రామారావుని అడిగినా ప్రయోజనం లేదని, వచ్చిన దారి పట్టాడు. ఆశ నిరాశల మధ్య నలిగిపోతున్న వెంకటేశ్వర్రావు.

లోకం నల్లని చీరను కప్పుకొని విచిత్రంగా చూస్తోంది. తెల్లని బాటమీద నడుస్తున్న అతనికి తర్వాత ప్రయత్నం గురించి తట్టడంలేదు. వెనుకనుంచి కారు హారను విన్పించినా తప్పుకోలేక పోయాడు. కారు ఆపుచేసి తలుపు కిటికీ నుంచి తల బయటకుపెట్టి గుడ్లు మిటకరించింది. నాల్గు వందల పౌన్లు గల్గిన మానవాకారం.

"బ్రతకాలని లేదా! రోడ్డు మధ్యగా నడవక పోతే, కొంచెం ప్రక్కగా నడవకూడదూ!" చీదరించుకుంటూ కారు చీకటిలో దూసుకు పోయింది.

బ్రతకాలనిలేదు. అయినా బ్రతకాలి. బ్రతికి ఎవర్ని ఉద్ధరించడానికి! ఎవర్ని సుఖ పెట్టడానికి! ఉద్ధరణకు, సుఖానికి దూరమయినపుడు బ్రతకడంవల్ల ప్రయోజనం? అదే అర్థంకాదు. ఆలోచిస్తే ఏమీ లేదు. అందరూ బ్రతుకుతున్నట్లే తనూ బ్రతకాలి. కష్టమో నిష్ఠూరమో కాల ప్రవాహంలో కొట్టుకు పోవాలి. మూడు కాలాల్లాగ మూడు దశల జీవితం చుట్టేవరకూ, బ్రతకాలి....

రోడ్డు ప్రక్కనున్న రావిచెట్టు రెమ్మలు గాలికి గజ్జలశబ్దం చేస్తున్నాయి. చీకటిని చీలుస్తూ దీపాలు అక్కడక్కడ వెలుగుతున్నాయి. వీధి కుక్కలు ఎంగిలిస్తార్లకోసం వెతుక్కుంటున్నాయి. పిడికెడు కవళంకోసం బిచ్చమెత్తుకుంటున్నారు అనాథలు. అడుక్కోలేక బ్రతకడంకోసం దొంగతనం చేస్తున్నారు దొంగలు. కడుపు కక్కుర్తికోసం, మానానికి వెలకట్టి, చీకటిలో శీలాన్ని వేలంవేస్తున్నారు పడుపుకత్తెలు, పెరిగిపోతున్న ధనాన్ని భరించలేక, తిన్న పదార్థాలను జీర్ణించుకోలేక, అంతస్తులలో అద్దాల గదులలో బూరుగుదూది పరుపుల మీద ఆపసోపాలు పడుతున్నారు శరీరాలను పెంచుకున్న శ్రీమంతులు. కష్టాలను చెప్పుకోలేక, ఆకలి మంటలతో అల్లల్లాడిపోతున్నారు పూరిగుడిసెల్లో నిరుపేదలు.

అర్థంకాని ఆవేదనలో, స్వార్థంలేని పరమార్థంలో జీవితవలయాలకు చుట్టుతున్న వెంకటేశ్వరావుకి వంకరగీతలు కన్పించాయి. అవన్నీ బీటలువారిన బాటలు తీసుకుపోతున్నాయి. ఆలోచనల ఆకారాలు అధికమవుతున్నాయి. మెదడు బరువెక్కింది. చీకటిని భరించలేకపోతున్నాడు. ఇంకా కొన్ని చూడలేకపోతున్నాడు. ఉప్పుటేరు వంతెనదాటి వచ్చాడు. గంటస్తంభ మీద గడియారం కాలాన్ని కొలుస్తోంది. చిన్నముల్లు తొమ్మిదికి పదికి మధ్య ఎర్రగా నిలబడింది.

చాల ఆలశ్యమైపోయింది. కుసుమ తనకోసం ఎదురుచూస్తూ వుంటుంది. తనింకా తిరుగుతున్నాడని బాధపడుతుందేమో! డబ్బు చిక్కలేదని గ్రహిస్తే, పిల్లల్ని పిలిచి కేకలేస్తుంది. ఇంటికి త్వరగా వెళ్ళిపోవాలి. వట్టిచేతులతో వెళ్ళితే, మధు ఎదురైతే, వాడికి ముఖంయెట్లా చూపించేది? చంటిదింకా నిద్రపోయి ఉండదు. కొత్తబట్టలని కలవరిస్తుంది. కుసుమ దాన్ని ఒడిలో వేసుకొని జోకొడుతూ ఉంటుంది.

"అమ్మా! నాన్న పరికిణీ తెచ్చారా!" చిన్న నోటితో చంటి అంటుంది.

"తప్పకుండా తీసుకొనివస్తారమ్మా!" అని కుసుమ తప్పకుండా చెప్పే వుంటుంది.

"అమ్మా! నాన్నింకా రాలేదేం? ఇంకా బట్టలషాపులోనే ఉండిపోయారా? మంచి బట్టలు దొరకలేదనుకుంటాను." అని మధుకూడా మేల్కొనే వుంటాడు. రేపటి గురించి, ఇప్పట్నుంచే ఆలోచిస్తూ సంబరపడుతుంటాడు.

అతనికి తెలియకుండా భూమి గుండ్రంగా తిరుగుతున్నా, నిజంగా భూమి అప్పుడు తన చుట్టూ తిరుగుతున్నట్లే అన్పించింది. తల తిరిగిపోతోంది. నెమ్మదిగా నడుస్తున్నాడు. ఎదురుగుండా భవనం కన్పించింది. అది అతని స్నేహితునిది. చదువుకుంటున్న రోజుల్లో, వాళ్ళ ఇద్దరి మనస్సులలో భేదంలేదు. భేదానికి అర్థంలేదు. పెద్దవారయ్యారు. వివాహాలయ్యాయి. బాధ్యతలు పెరిగాయి. మనస్సులు

(601-వ పేజీ చూడుడు)

(592-వ పేజి తరువాయి)

మారాయి. స్నేహితుని హృదయం భేదానికి అర్థం చెబుతోంది. పేద పెన్నిధుల తారతమ్యాన్ని కొలత బద్దతో కొలచి చూపిస్తోంది.

అతని దగ్గరకు వెళ్లడానికి మనస్కరించలేదు. వెళ్లకపోతేయెట్లా! అవసరం-వెళ్ళాలి. ప్రయత్నం చేయకంవల్ల నష్టమేముంది? మెట్లు గబగబా ఎక్కిపోయాడు. కుక్క బౌంయ్‌మని అరవడం మొదలు పెట్టింది. అతడు క్రిందకు దిగిపోయి, జాలిగా కుక్క కళ్లలోనికి చూస్తున్నాడు. చివరకు జంతువులకు కూడా తనమీద జాలిలేనట్లు ఫీలవుతున్నాడు. క్రింద నుంచి చాలసార్లు పిలిచాడు. బలం కొలది అరచాడు. సమాధానంలేదు.

కాస్సేపటిలో బయట కారొకటి ఆగింది. కారు లోనుంచి వస్తున్న స్నే హి తు డ్ని గుర్తుపట్టాడు పిల్చాడు. మిత్రుడు రాలేదు, అతడే స్నేహితుని వద్దకు వెళ్ళాడు.

చాల అవసరం... "ఒక పదహేను రూపాయలు వుంటే యివ్వు. ఒకటవ తారీఖున ఇచ్చేస్తాను" స్నేహితుని వైపు చూశాడు.

"అరెరె! ఇప్పుడే వంద రూపాయలు పేకాట ఆడేశాను. నా దగ్గరేమిలేదు. సారీ!" జేబులో వుంచుకునే, అతి తేలిగ్గా అబద్ధం ఆడేశాడు. అబద్ధం జన్మస్థానం డబ్బు దగ్గరని అర్థమయింది. కిక్కురు మనకుండా అచ్చటనుంచి వెళ్ళిపోయాడు.

విచార వదనంతో ఇంటికి చేరుకున్నాడు. తలుపులు దగ్గరగా వేసివున్నాయి. తలుపులను తోసి లోపలికి కాలు పెట్టాడు. గుమ్మం దగ్గర గోడ నాను కొని చాపమీద కుసుమ కూర్చునివుంది. ఒడిలో తల పెట్టుకొని, పాప నిద్రబోతోంది. మధు గదిలో నిద్రబోతున్నాడు. ఇనుప కొక్కానికి తగిలించిన హరికేన్ లాంతరు కిరసనాయిలు లేక మినుకు మినుకు మంటోంది, చావు బ్రతుకుల మధ్య చెరలాడే ప్రాణి లాగ. కుసుమ నెమ్మదిగా పాప తలను తీసి దిండు మీద పెట్టి, లాంతరు దగ్గరకు వచ్చి వత్తిను పెద్దది చేసింది. వెంకటేశ్వర్రావు ఎదురుగుండా కన్పించాడు, తలంతా రేగిపోయివుంది. తల వెంద్రుకలు కళ్ళద్దాల మీద చిందర వందరగా పడివున్నాయి. కళ్ళద్దాలను తీసి, దండానికి తగిలించిన తువాలుతో శుభ్రంగా తుడిచి, కళ్ళల్లో పడుతున్న వెంద్రుకలను పైకెగ దోసి, కళ్ళద్దాలను పెట్టుకున్నాడు. మడిచి వున్న నడత మంచాన్ని వాల్చి, మంచంమీద పత్తి గిల్లాడు. కుసుమ దగ్గరగావచ్చి నిలబడింది.

"బాబు నిద్రపోయాడా?" మెల్లగా అడిగాడు.

"మీరు వస్తారని చాల సేపటివరకు చూచి, ఇప్పుడే నిద్రపోయాడు."

"బట్టలకోసం కూర్చున్నాడా?"

"పిల్లలు ఏది పట్టిస్తే అది. వాడేదో కొనమన్నా డని, డబ్బులేదని మీరు బాధ పడటం దేనికి? వాడికి సర్ది చెప్పకూడదు?"

"నోరు ఎండిపోయింది. ముందు కాసిని చల్లని నీళ్లు తెచ్చిపెట్టు."

కుసుమ గ్లాసుతో మంచినీళ్లు తీసుకొనివచ్చి, వెంకటేశ్వర్రావు కిచ్చింది. గడగడ మంచినీళ్లు త్రాగుతూ ఆమె వాక చూశాడు.

"ఎంత ప్రయత్నించినా లాభంలేదు." కాళీ చేసిన గ్లాసును నేలమీద పెట్టాడు.

"వాళ్లగురించి అనవసరంగా బాధపడుతున్నారు." దుప్పటి దిండు తీసుకొనివచ్చింది.

"ఒక్కసారి లేవండి. పక్క వేస్తాడు" వెంకటేశ్వర్రావు లేచి నిలబడ్డాడు. దుప్పటి దులిపి, మంచంమీద పరచి, తలదగ్గర దిండు పెట్టింది.

"తిరిగి తిరిగి వచ్చారు. నిద్రపోండి." కుసుమ అచ్చటనుంచి వెళ్లిపోయింది.

"కుసుమా!"

కుసుమ వెనక్కి తిరిగి, దగ్గరగా వచ్చింది.

"కుసుమా! రేపు పండగకదూ!" ఆమెను దగ్గరగా తీసుకొని, విశాల నయనాలలోనికి తొంగి చూశాడు.

"మీరు మరీ చిన్న పిల్లలయిపోతున్నారు. రేపు పండగని మీకు కొత్త బట్టలు కుట్టించాలా?"

"కుట్టిస్తావా?"

"పెళ్ళినాడు ప్రధానానికిచ్చిన లైటు సిమెంటు కలరు చీర చించి కమీజు కుట్టించ మంటారా?" నవ్వుతూ అతని బుగ్గలను పొడుగాటి వ్రేళ్ళతో రాస్తూ, చిలిపిగా అతని కళ్ళల్లోకి చూస్తుండిపోయింది,

"ఇంకా నయం! నీ చీరలను కట్టుకోమన్నావు కాదు."

"చాల పొద్దుపోయింది. నిద్రపోండి."

"నిద్ర పడుతుందా?"

"కొత్త బట్టలు కుట్టించలేక పోయేరని మీరు నాకు ధైర్యం చెప్పవలసింది బదులు మీకు నేను ధైర్యం చెప్పవలసి వచ్చింది. డబ్బుకి ఇబ్బందిగా ఉన్నప్పుడు ఆశలను చంపుకోవాలి. వాళ్ళకు బట్టలు లేనంత మాత్రంలో పండగ ఆగిపోదుగదా?"

"చిన్న పిల్లల బాధ నీకేమి అర్థమవుతుందే!"

"అక్కడకు మీరు కన్నట్లు మాట్లాడతారేం! జీవితంలో బాధను పంచుకునేది భార్యా భర్తలకు సమానమేగా!"

"సరేగాని, రేపు బాబుకి సమాధానం చెప్పే దెట్లా?"

"నేను చెప్తాను. మీరు నిద్రపొండి." అతని కౌగిలినుంచి విడిపోయి, అచ్చటనుంచి వెళ్లిచాప మీద నడుం వాల్చింది.

ఎప్పుడు చీకటి పోయిందో, ఎప్పుడు తెల్లవారి పోయిందోగాని, లోకం కళ్లు తెరచి కార్యక్రమంలో మునిగింది. సూర్య కిరణాలు కిటికీలోనుంచి దూసుకొనివచ్చి, వేడిగా శరీరాన్ని తాకుతున్నా, వెంకటేశ్వర్రావు కదల్లేదు. ఇంకా నిద్రపోతూనే ఉన్నాడు. మధు, పాప తండ్రి లేస్తాడని ఎదురుచూస్తూ నిలబడ్డారు. అతడు లేచేసరికి ఏడయింది. ఎదురుగుండా నిలబడివున్న మధు పాపలను చూచి దిగ్భ్రాంతి జెందాడు.

"మంచి చొక్కా కొన్నావు చాల బావుంది," సంతోషం పట్టలేక ఎగిరి గంతేస్తున్నాడు మధు.

"నా బట్టలుకూడా చక్కగా వున్నాయి." తండ్రి దగ్గరకువచ్చి, మంచంమీద కూర్చుంది పాప.

వెంకటేశ్వర్రావుకంతా అయోమయంగా ఉంది. కల గంటున్నాడేమో అన్పించింది. బట్టలు 'యెట్లాగ వచ్చాయి? ఎవరు కుట్టించారు?? డబ్బెక్కడ్నుంచి వచ్చింది???' తనలో తాను ప్రశ్నలు వేసుకుంటున్నాడు. సమాధానాలు రావడంలేదు.

"నాన్నా బడికి వెళ్తాం!" మధు పాపను వెంట పెట్టుకొని వెళ్ళిపోయాడు. వెంకటేశ్వర్రావు పొయి దగ్గర కూర్చున్న భార్య దగ్గరకు వచ్చి నిలబడ్డాడు. కుసుమ వెనక్కి తిరిగి చూచింది.

"ఊరంతా పండగ సందడితో కల కలలాడుతోంది. మొహం కడుక్కొని రండి. వేడి వేడి పెసరెట్లు మీకోసం ఎదురుచూస్తున్నాయి."

"కుసుమా! నీటిలో చార, స్త్రీ హృదయంలో జాడ తెలుసుకోలేమంటారు. నిజమేనా?"

"ఇంత ప్రొద్దున్నే మీ కంత పెద్ద ధర్మసందేహం ఎట్లాగ వచ్చింది?"

"వాళ్లకు కొత్త బట్టలు ఎట్లాగ వచ్చాయి."

"మీరు కొని పెట్టారటగా..."

"ఇది మరీ బావుంది. పండగ పూట అబద్ధం దేనికి?"

"అబద్ధాలు చెప్పడం ఆడవాళ్లకు అలవాటని మీరే అంటారుగా?"

"వేళాకోళాలు తర్వాత. ముందు త్వరగా చెప్పు!" కోపంతో అన్నాడు.

కుసుమ అతని కోపాన్ని కనిపెట్టింది.

"నీ ప్రయత్నంవల్ల నన్ను బాధ పెట్టాలనే ఉద్దేశ్యం నీకు లేకపోవచ్చును. కాని..." శాంతంగా తిరిగి తనే అన్నాడు.

"తర్వాత మాటలు చెప్పి నన్ను కష్ట పెట్టకండి. తీరిక సమయాల్లో, నూలువడికి, లేసులల్లి, ఇస్త్రర్లు కుట్టి కొంత డబ్బు సంపాదించాను. ఆ డబ్బుతో పిల్లలకు బట్టలు తీసుకున్నాను."

"ఆ సంగతి ముందే ఎందుకు చెప్పలేదు. నా అప్రయోజకత్వాన్ని నాకే చూపించడానికా!"

"అంతంత మాటలు అనకండి. మీరు వేళ్ళేముందు చెప్పలేనందుకు బాధ పడుతున్నాను. మీ రీ విధముగా అనుకుంటే నన్ను క్షమించండి. ఇటువంటి పనులెప్పుడూ తలపెట్టను." జాలిగా బాధగా భర్త వంక చూచింది.

ఆమె చూపుల్లో...

అవ్యాజమైన అనుబంధం

అనూహ్యమైన అభిమానం...

అతనికి అందాయి.

"పండగంతా మన ఇంట్లోనే వూరేగుతుందను కుంటాను. నవ్వుతూ మాటమార్చాడు. భర్త కోపం చల్లారిందని కుసుమ మనసు తేలిక బడింది.

"మన ఒక్కరికే కాదుగా ఈ పండగ భారత దేశంలో ప్రతి ఇంటింట చేసుకోవలసిందే! ఎవరికి వున్న దాంట్లో వాళ్ళు పండగ చేసుకోకుండా మానరు."

"అయితే మధ్యాహ్నం పిండివంటలు ఏం చేస్తున్నావు."

"బిరంజీ చేస్తున్నాను. గారెలు మీ కిష్టంగా... అవి కూడా చేస్తున్నాను"

"బ్రహ్మాండంగా ఉంది. కుసుమా దేవికి జై !!"

"వసంతాలు నిండిన అల్లరి పోలేదు."

"నీబోటి ఇల్లాలు వుంటే కర్ర చేతికి వచ్చినా అల్లరిపోదు."

వెంకటేశ్వర్రావు మొహం కడుక్కొనివచ్చి, వేడి వేడి పెసరట్లు ఆరగించి, మూతిని భార్య పమిట చెంగుతో తుడుచుకొని, నిలబడ్డాడు.

"నిజమైన పండగనిపించావు. నీబోటి ఇల్లాలు వుంటే ఆ ఇంట్లో రోజూ పండగే!"

అంటూ బయటకు బయలుదేరాడు...

పాతురిడు గారి

బాలసంజీవిని (Regd)

పిల్లల లివర్ అండ్ స్లీపెన్ వ్యాధులను నివారించును

డాక్టరు పిల్లా పాపయ్య పాత్రుడు అండ్ బ్రదర్స్,

19, దక్షిణ మాడవీధి, మైలాపూరు, మదరాసు-4. Phone 71354

కుంభకోణము బ్రాంచి: 7. సారంగపాణి కోవెల తూర్పువీధి.

అన్ని మందుల షాపులలోను దొరకును.